# ఆధునిక నీతి కథలు

వాల్లూరు నాగేశ్వరరావు

రిక్షారాములు — నియోజకవర్గంలో ఎం.ఎల్.ఏకు అభ్యర్థిగా దరఖాస్తు దాఖలు చేశాడు. ఏదైనా పార్టీ టిక్కెట్టు దొరుకుతుందేమోనని ఢిల్లీ దాకా పోస్టుకార్డు లాగా విమానంలో వెళ్లొచ్చాడు. అధికారపార్టీ తరపున టిక్కెట్టు ఇసుకలో తైలం రీతిన అయింది. తెలుగుదేశం తరపున నిలబడేందుకు పట్టణంలో పది మంది షావుకార్లనూ, పదకొండు మంది కౌన్సిలర్లనూ వెంటేసుకొని పార్టీ నాయకుడి దగ్గరకు 'ర్యాలీ'గా వెళ్లాడు రాములు. 'చూద్దాం' అన్నట్టు తాత్కాలికంగా తలఆడించిన నాయకుడు ఫైనల్‌గా 'నో' అనేశాడు. దాంతో వొంటికి కొత్తకారం అంటుకున్నట్టు చిందులు తొక్కి, ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశాడు.

పదిహేనేళ్ల క్రితం రాములు ఆ టవున్‌కు బిక్కాపకీరుగా వచ్చి, బ్రతుకుతెరువుగా రిక్షా అద్దెకుతీసుకొని తొక్కాడు. సంవత్సరం తిరక్కముందే రిక్షా ఓనర్ అయ్యాడు. మూడేళ్లు ముగిసేసరికి మూడు రిక్షాలు కొని అద్దెకు పెట్టాడు. మరో మూడేళ్లల్లో ఓ డజను రిక్షాలు కొని, రిక్షా ఓనర్ల అసోసియేషన్‌కు ప్రెసిడెంటయ్యాడు. ఆ పైన స్వగృహస్థుడై, ఆ వార్డులో కౌన్సిలర్‌కు పోటీచేసి, నెగ్గాడు. ఆ తర్వాత మున్సిపల్ ఎలక్షన్లలో మళ్లీ కౌన్సిలర్‌గా ఎన్నికై, ఛైర్మన్‌కు పోటీచేసి, మూడు వోట్ల మెజారిటీతో గెల్చాడు. మున్సిపల్ ఛైర్మన్ అయినప్పటికీ, సైకిల్ల వ్యాపారంలో, పి.డబ్ల్యు.డి. కాంట్రాక్టుల్లో లక్షలకొద్దీ సంపాదించినప్పటికీ, మూడంతస్థుల మేడ కట్టినప్పటికీ, పదమూడు ధర్మసంస్థల్లో మేనేజింగ్ ట్రస్టీగా వున్నప్పటికీ, రాములుకు రిక్షారాములనే పేరు ఆ టవునుజనం నోళ్లనుంచి పోలేదు. అందుకు రాములుకు ఏమాత్రం చింతలేదు. తాను రిక్షా కార్మికుడిగా జీవితం ప్రారంభించి మూడు పంచవర్ష ప్రణాళికల్లో టవున్ హోల్ మొత్తంమీద పలుకుబడి సంపాదించినందుకు సంతో

షిస్తూ వుంటాడు. ఆ సంతోషంతోనే అఖిల భారతీయ, ప్రాంతీయ పార్టీలు తన పలుకుబడి విలువను గుర్తించకపోయినప్పటికీ ధీమాగా స్వతంత్ర అభ్యర్థిగా ఎంఎల్యేకు నిలబడ్డాడు. గెలవగలననే నమ్మకాన్ని గట్టిగా కుదుర్చుకున్నాడు. రిక్షారాములుకు ఎన్నికల్లో 'ఏనుగు' గుర్తును కేటాయించారు.

ఎలక్షను తేదీ దగ్గరపడుతూన్నకొద్దీ ప్రచారం ముమ్మరం కాసాగింది.

ఎన్నికల సభలు; వాల్‌పోస్టర్లు, కార్లూ; మైకులూ; పాటలూ; పద్యాలూ; గోడల ఖర్చులు; నినాదాలూ; నియోన్‌లైట్లమధ్య చేయి, సైకిలూ, పుష్పం, ఏనుగు, గుర్రం, పులిబోర్డులు, జండాలు, ఊరేగింపులు— టవునంతా ఎన్నికల జ్వరంతో, వూపుతో, గాలితో గందరగోళంగా ఉంది. కాఫీహోటళ్లకూ, సారా దుకాణాలకూ, సినిమా హాళ్లకూ గిరాకీ హెచ్చింది.

అందరితోపాటు రాములు ఎన్నికల ప్రచారాన్ని భారీ ఎత్తున ప్రారంభించాడు. అయిదు కార్లను అద్దెకు తీసుకున్నాడు. అరవై రిక్షాలకు 'ఏనుగు' జండాలను కట్టించాడు. పేటకు మూడు చొప్పున ఎన్నిక కార్యాలయాల్ని తెరిపించాడు. టవున్లో రౌడీలందరికీ రోజుకింత చొప్పున బేటాలిస్తూ తన అధీనంలో పెట్టుకున్నాడు.

ఎలక్షన్‌రోజు రేపనగా నోట్ల కట్టల బీరువాను తెరిచాడు రాములు. విశ్వాసపాత్రులైన ముఖ్యులందర్నీ సమావేశపర్చాడు. ఆ రాత్రికి రాత్రి వోటుకు వందరూపాయలనోటు యిచ్చి, అమ్మకానికొచ్చే వోట్లన్నీ కొనమని అందర్నీ ఆదేశించి, నోట్ల కట్టల్ని పంచాడు.

మరునాడు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

కారు డిక్కీలో నోట్లకట్టల్ని వేసుకొని ఉదయం ఎనిమిదినుంచీ సాయంత్రం అయిదు వరకూ నిర్విరామంగా తిరిగాడు రాములు. కారు డిక్కీ ఖాళీ అయింది.

మరునాడు వోట్ల లెక్కింపు.

అధికార పార్టీ, ప్రాంతీయ పార్టీ మధ్యనే ప్రధానమైన పోటీ అనీ, ఇండిపెండెంట్లకు డిపాజిట్ కూడా దక్కదని ఆ రోజు పోలింగ్ చూసినవాళ్ల అంచనా.

అనుభమున్న రాజకీయవేత్తలూ, ఎన్నికల పోలింగ్‌లో అందెవేసిన చేతులూ కాంగ్రెస్ (ఐ), తెలుగుదేశం అభ్యర్థులమధ్య వందల సంఖ్యలోనే వోట్ల వ్యత్యాసముంటుందని భావించారు.

మరునాడు వోట్ల లెక్కింపు.

ఉదయం పదిన్నరకే ప్రధానమైన పార్టీల అభ్యర్థులకంటే రాములు రెండున్నర వేల వోట్ల ఆధిక్యతతో ఉన్నాడు.

టవున్లో అందరూ ఆశ్చర్యంతో నోళ్లమీద అరిచేతులు పెట్టుకున్నారు

మధ్యాహ్నం రెండున్నరకు రిక్షారాములు ఎం.ఎల్.ఏగా మూడువేల రెండొందల అరవై మూడు వోట్లతో నెగ్గినట్టు అధికారరీత్యా ప్రకటించబడింది.

*ఈ ప్రజాస్వామ్యంలో నోటుకున్న విలువ వోటుకు లేదు.*


మార్చి సంచికలో పూర్తి నవల

# రంగుల బొమ్మ

జి. ఎస్. రమేష్ (రాధ) రచన